క్లుప్తంగా

27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు



ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతారామపురం: మండలంలోని సచివాలయాల్లో ఈనెల 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్ తెలిపారు. మండలంలోని మారంరెడ్డిపల్లి, నెమళ్లదిన్నె సచివాలయాల్లో బుధవారం చేపట్టిన ఆధార్ క్యాంపును ఆయన పరిశీలించారు. గురువారం బాలాయపల్లి, పబ్బులేటిపల్లి సచివాలయాల్లో క్యాంపులు జరుగుతాయన్నారు. ఆధార్ బయోమెట్రిక్, మార్పులు, నూతన కార్డుల నమోదుకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

• **వరికుంటపాడు:** మండల కేంద్రంలోని సచివాలయంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఆధార్ లేని వారు ఈనెల 27వ తేదీలోపు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణకుమారి తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎం.ఏసు అనే వ్యక్తి తనను గ్రామానికి చెందిన కె.వెంకటరమణయ్య కులం పేరుతో దూషించాడని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై తిరుపతయ్య ఇద్దరినీ పిలిపించి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. కేసు రాజీ చేసే ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

• ఈఈ జనార్దన్

చేజర్ల: ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ జనార్దన్ తెలిపారు. మండలంలోని బోడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఆయన అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ కనెక్షన్ ఉండి ప్రతి నెలా ఉచిత విద్యుత్ మోటార్లు వాడుకునే వారు సర్వీస్ చార్జి రూ.30 చెల్లించాలన్నారు. ఇప్పుడు బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్ ద్వారా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ సురేష్, ఏఈ ఉడతా మన్మథరావు జేఈ అక్బర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కావలి: మోటార్‌బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్ పిలుపునిచ్చారు. కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రామమూర్తిపేట ప్రాంతంలో ఉన్న హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయం దగ్గర బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. హెల్మెట్ ధరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయ అవార్డు గ్రహీత నందనవనం ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. దేశ రక్షణ కోసం సైనికులు చేసే సేవలు మరువలేనివని ఆయన అన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

మర్రిపాడు: మండలంలోని చిన్నమాచనూరు రైతు సేవా కేంద్రం పరిధిలో నాగరాజుపాడు గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్ వరిపంటను పరిశీలించారు. ఇందులో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగులను గమనించారు. ఇవి పోవడానికి ఏం పిచికారీ చేయాలో తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ ఎస్‌కే షాజియ, వీఏఏ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

డబ్బిస్తే చాలు.. ఇక మీ ఇష్టం

• వరికుంటపాడులో అసాంఘిక కార్యకలాపాలు
• శాంతిభద్రతలను పట్టించుకోని పోలీసులు
• కేసును బట్టి రేటు
• విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
• పల్లెల్లో జోరుగా అశ్లీల నృత్యాలు



వరికుంటపాడు పోలీస్‌స్టేషన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: అక్రమార్కుల భరతం పట్టి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాల్సిన కొంతమంది పోలీస్ సిబ్బంది అవినీతి సొమ్ము కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ శాంతిభద్రతలను గాలికొదిలేశారు. డబ్బులిచ్చుకో.. ఏ పనైనా చేసుకో అన్న చందాన వ్యవహరిస్తున్నారు. ఇదీ ప్రకాశం జిల్లా సరిహద్దున ఉన్న వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌లో కొంతకాలంగా జరుగుతున్న తంతు. కంచె చేను మేసిన చందంగా స్టేషన్ అధికారి ఉండడంతో కానిస్టేబుళ్లు కూడా అవినీతి బాటలో ఉంటూ బాధితులను పీడిస్తున్నారు.

విధులకు ఎగనామం

ఈ స్టేషన్‌లో ఎవరి పని వారిదే. ఎవరెక్కడ ఉంటారో.. ఎప్పుడు స్టేషన్‌కు వస్తారో అక్కడి అధికారికి కూడా తెలియదనే ఆరోపణలున్నాయి. ఎవరి పనులు వారివి. ఎవరిష్టం వారిదే. బాధితులకు సమాధానం చెప్పేవారుండరు. ఒకవేళ చెప్పినా పొంతన లేని నిర్లక్ష్యపు సమాధానాలే ఎదురవుతాయి. ఫిర్యాదులిచ్చే వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదు. తప్పు చేసిన వారు కాసులిస్తే చాలు. మంచివారి కిందే లెక్క. బాధితులకు చీవాట్లు తప్ప ఓదార్పు కనిపించదని ప్రచారం ఉంది.

బాబోయ్ దొంగలు

మండలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో చాలా చోరీలు జరిగాయి. ఇవి ఆగడం లేదు. అయినా పోలీసులకు చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శలున్నాయి. ఇటీవల వరికుంటపాడులో నాగారపమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు దోచుకున్నారు. ఒక మోటార్‌బైక్, ఒక మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. మూడుచోట్ల రూ.32 వేల నగదు అపహరించారు. రాత్రివేళ గస్తీ గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో కొన్నిచోట్ల స్వయంగా యువత వంతుల వారీగా రాత్రివేళ గస్తీ తిరుగుతున్నారు. కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించకుండా పోలీసులు అలాగే వదిలివేశారు. అవి ఉండి ఉంటే దొంగలు ఎప్పుడో దొరికేవారు. కానీ ఆ సంగతి పట్టించుకోలేదు.

ఏమైనా చేయొచ్చు

డబ్బు ముట్టజెబితే ఏ పనికైనా పోలీసులు రైట్ అంటారనే విమర్శలున్నాయి. పిల్లాపేరు, ఉప్పువాగుల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. అడిగినంత ఇస్తే సరే.. లేకపోతే వాహనాలు సీజ్ అవుతాయి. నెల మామూళ్లు ఇచ్చిన వారు దర్జాగా ఇసుక రవాణా చేసుకోవచ్చు.

• అశ్లీల నృత్యాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటిని అడ్డుకోకుండా ఉండేందుకు పోలీసులు పెద్ద మొత్తంలో నగదు తీసుకుంటున్నట్లు సమాచారం. మంగాపురం, తిమ్మారెడ్డిపల్లి, కొండాయపాళెంలో పోలీసుల సమక్షంలోనే రింబోలా డ్యాన్స్‌లు (అశ్లీల నృత్యాలు) జరిగాయి.

• బాధితుడైనా.. నిందితుడైనా.. స్టేషన్‌కు వస్తే చేతి చమురు వదలాల్సిందేనన్న ప్రచారం ఉంది. స్థానికంగా ఉండే ఓ పెట్రోల్ బంకులో అవినీతికి సంబంధించిన లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం. ఇసుక వాహనాలు, తెల్లరాయి లారీల నుంచి వసూలు చేస్తున్నారు. న్యాయం, అన్యాయంతో ప్రమేయం లేకుండా ఇక్కడ ఎస్సై ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికి మద్దతు పలుకుతూ విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి తిట్టడం, కొట్టడం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో ఇక్కడ పరిస్థితులు ఉన్నతాధికారులకు తెలియడు. దీంతో విచ్చలవిడిగా పెట్రేగిపోతున్నారు. పైస్థాయి అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శాంతిభద్రతలు కాపాడి, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి, వరుస చోరీల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాల్సి ఉంది.

కావలి డిపోకు త్వరలో కొత్త బస్సులు

• ఆర్‌ఎం విజయరత్నం వెల్లడి



ఉద్యోగిని సన్మానిస్తున్న ఆర్‌ఎం

కావలి: కావలి డిపోకు త్వరలో కొత్త బస్సులు రానున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జి.విజయరత్నం తెలిపారు. స్థానిక డిపోలోని పలు విభాగాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్యారేజ్ ఆవరణలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో పాల్గొన్నారు. అత్యధికంగా ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లు బాలకోటయ్య, చెంచయ్యను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ఆర్‌ఎం మాట్లాడుతూ ఏ సంస్థ అభివృద్ధి సాధించాలన్నా క్రమశిక్షణ ముఖ్యమని చెప్పారు. అద్భుత విజయాల వెనుక రహస్యాలేమీ లేవని, కేవలం ఇష్టంతో, కష్టపడి పనిచేయడమేనన్నారు. ఉద్యోగులందరూ శ్రద్ధతో పనిచేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, సూపరింటెండెంట్ (ట్రాఫిక్) ఎం.రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ వినతిపత్రాలు



ఆత్మకూరు: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు: విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను ఉన్నతాధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు కోరారు. ఈమేరకు ఆత్మకూరు ఎంఈఓ, ఎంపీడీఓలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జీఓఎంఎస్ నంబర్ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్2 పాఠశాలలను పెట్టాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు గంగాధరం, షేక్ ఖాదర్‌బాషా, మోహన్‌రావు, హరికృష్ణ, జిలానీ, మణికుమార్, రవీంద్ర, మురళీకృష్ణ, శివప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• **వరికుంటపాడు:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి తగిన న్యాయం చేయాలని కోరుతూ అధికారులకు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. కె.చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ కరిముల్లా, వి.సుబ్రహ్మణ్యం, ఎం.సుబ్బారావు, హరిశ్చంద్ర, కాంతారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

• **సోమశిల:** యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అనంతసాగరం మండల నాయకులు బుధవారం అధికారులను కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వద్దిబోయిన వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ సాదిక్, జిల్లా కార్యదర్శి హెచ్ మోహన్ ప్రసాద్ మాట్లాడారు. కె.వెంకటేశ్వర్లు, కె.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

• **మర్రిపాడు:** యూటీఎఫ్ నాయకులు బుధవారం అధికారులను కలిసి సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, కె.సుధాకర్, చిన్నపరెడ్డి, కిరణ్‌బాబు, బి.ప్రసాద్, ఎస్.వెంకటేశ్వర్లు, షేక్ రఫీ పాల్గొన్నారు.

• **చేజర్ల:** యూటీఎఫ్ నాయకులు బుధవారం ఎంఈఓ–2 మస్తానయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌వీ కృష్ణయ్య, నాగినేని రమణయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య, సునీల్‌కుమార్, శ్రీరాములు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ‘శిక్షా సప్తాహ్’



ఆటలాడుతున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థుల చేత ఆటలు ఆడించారు. మహిమలూరు మెయిన్, వెన్నవాడ, అశ్వనీపురం ఉర్దూ, మురగళ్ల, బండారుపల్లి, బోయలచిరివెళ్ల తదితర బడుల్లో కబడ్డీ, కుందుడుగుమ్మ, వీల్‌చైర్ తదితర ఆటలను విద్యార్థుల చేత ఆడించారు.

సంజీవరెడ్డి నగర్ సమీపంలో రోడ్డు ప్రమాదం

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డి నగర్ గ్రామ సమీపంలో బుధవారం ఉదయం బొలెరో వాహనం అదుపుతప్పి అందులో ప్రయాణిస్తున్న సీతారామపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామిశెట్టి తిరుపతయ్యకు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. తిరుపతయ్య సీతారామపురం నుంచి ఉదయగిరికి బొలెరో వాహనంలో బయలుదేరాడు. ఆయనే వాహనం నడుపుతున్నాడు. సంజీవరెడ్డి నగర్ గ్రామ సమీపానికి వచ్చేసరికి నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు మార్జిన్ దిగి పక్కనున్న గోతిలో పడింది. స్థానికులు గమనించి వాహనాన్ని పైకి లేపారు. ఈ ఘటనలో తిరుపతయ్యకు ఎలాంటి గాయాలు కాలేదు.

నిబంధనల మేరకే ఇసుక రవాణా



యార్డు వద్ద సీఐ వేణు

మర్రిపాడు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా జరుగుతుందని ఆత్మకూరు సీఐ జి.వేణు తెలిపారు. మర్రిపాడులోని ఇసుక డంపింగ్ యార్డును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయంత్రం 6 గంటల వరకే డంపింగ్ యార్డు వద్ద వాహనాలకు అనుమతి ఉంటుందన్నారు. అక్రమ రవాణా అడ్డుకట్టకు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసులు గస్తీ నిర్వహిస్తారని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కావలి: పట్టణంలోని కావలి ఉమెన్ ఫోర్స్ ఆధ్వర్యంలో స్థానిక విశ్వోదయ బాలుర ఉన్నత స్కూల్లో ‘పాఠశాల దశలోనే నైతిక, సామాజిక, జీవిత విలువలను నేర్పాలి’ అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌డీ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వపు హెచ్‌ఎం, కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద మాట్లాడారు. తప్పుదారిలో వెళ్తున్న యువత ఆడపిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్నారన్నారు. జూలై నెలలో కొన్ని ఘటనలు జరిగాయన్నారు. నెల్లూరు నారాయణ ఒలింపియాడ్ స్కూల్లో జయధర్ అనే విద్యార్థి తరగతి గదిలో జరిగిన అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆ బాలుడికి జీవితం విలువ తెలియకపోవడం, కుటుంబంతో మంచి, చెడు చెప్పుకొని పరిష్కారం కోసం వెతకాలని తెలియకపోవడం కారణమని వివరించారు. ఫోర్స్ సెక్రటరీ షేక్ ఫాతిమా మాట్లాడారు. సభ్యులు నూర్జహాన్, బుష్రా, సుమయ్య, టీచర్లు కల్యాణి, శ్రీహరి, శ్రీనివాసులురెడ్డి, షరీఫ్, దేవకి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తున్నాం



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

మర్రిపాడు: ప్రభుత్వ నిబంధనల మేరకు కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఏపీఓ వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని నందవరం గ్రామంలోని నరసింహులు పొలంకుంట వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 11 గంటల్లోపు పనులను పూర్తి చేసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గత నెలకు సంబంధించిన వేతనాలు త్వరలోనే బ్యాంక్ అకౌంట్లలో జమవుతాయన్నారు. పంచాయతీలో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఉపాధి జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరూ పనులకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలపై ముమ్మర ప్రచారం



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సురేంద్ర

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలతో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని, వీటిపై ముమ్మర ప్రచారం చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో ఆర్పీలు, మెప్మా సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.436 ప్రీమియంతో ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. బీమా చేయించుకున్న వారు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు బాధిత కుటుంబసభ్యులకు అందుతుందన్నారు. అదే క్రమంలో ప్రమాదవశాత్తు మృతిచెందితే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందజేయబడుతుందని వివరించారు. పొదుపు సభ్యులు బీమా చేయించుకునేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మెప్మా బీఎం సురేంద్ర, సీఓ మాధవి పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రామసభలు



సీతారామపురం: గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, వాశిలి, బండారుపల్లి, రామస్వామిపల్లి, రావులకొల్లు, నాగులపాడుల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రజలకు అవసరమైన తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, నీళ్ల ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల పునరుద్ధరణ, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు చెలిక రమాహరిబాబు, పూనుగుంట రేవతి, చేరెడ్డి పద్మావతి, సోమవరపు వెంకట రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు షేక్ షఫీ, ఆర్.అంకయ్య, సంపూర్ణ పాల్గొన్నారు.

• **సీతారామపురం:** మండలంలోని సింగారెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి, బాలాయపల్లి, దేవమ్మచెరువు, పోలంగారిపల్లి, చిన్నాగంపల్లి పంచాయతీల్లో బుధవారం సర్పంచ్‌ల అధ్యక్షతన ఓడీఎఫ్, జల్‌జీవన్ మిషన్‌పై అధికారులు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరాపై చర్చించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్, ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

• **చేజర్ల:** ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పుట్టుపల్లి సర్పంచ్ అమ్మినేని పురుషోత్తం నాయుడు అధికారులను కోరారు. బుధవారం గ్రామంలో ప్రత్యేక సభ జరిగింది. ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన అన్నారు.

హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలో బీసీ బాలికల వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్ భవన నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత ఆధ్వర్యంలో బుధవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వై.వెంకటయ్య, ఆత్మకూరు డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ చల్లా శ్రీదేవి, తదితరులు మున్సిపల్ పరిధిలోని స్థలాలను పరిశీలించారు. గతంలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

సీతారామపురం: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అధికారులు గ్రామాల్లో ముందస్తుగా క్లోరినేషన్ చేయిస్తున్నారు. బుధవారం సింగారెడ్డిపల్లి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వీధులు శుభ్రం చేయించి మురుగు కాలువల్లో పూడిక తీయించారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్ పర్యవేక్షించారు.

కొండాయపాళెంలో ‘ఫ్యామిలీ డాక్టర్’

వరికుంటపాడు: మండలంలోని నార్త్ కొండాయపాళెం గ్రామంలో మండల వైద్యాధికారిణి ఆయేషా బుధవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సుమారు 33 మంది దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించి ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. చిన్నారుల ఊపిరితిత్తుల్లో నెమ్ము సోకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

గంధమహోత్సవ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉదయగిరి: ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరి ఔలియా వారి 219 గంధమహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. దర్గా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీ సందల్‌మాలి కార్యక్రమంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 3న గంధమహోత్సవం, 4న జప్పెచిరాగి ఫాతేహా, 5న తహలీల్ ఫాతేహాతో ఉత్సవం ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా భక్తులతో అన్నదానం చేస్తామన్నారు. పాటకచేరి, ఖవ్వాలి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజీదార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్ బాషా, కావ్య ట్రస్ట్ ప్రతినిధి సికింధర్, షేక్ రియాజ్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలని ఆదేశం

వరికుంటపాడు: మండలంలో మరుగుదొడ్ల సర్వేను త్వరగా పూర్తిచేసి పంచాయతీల వారీగా నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ కృష్ణకుమారి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఓడీఎఫ్ గురించి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూరు శాతం సర్వే చేయాలన్నారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా జరుగుతున్న ఆధార్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

తహసీల్దార్లకు సన్మానాలు



అల్లూరు తహసీల్దార్‌ను సన్మానించిన సిబ్బంది

సంగం: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు వచ్చి బదిలీ అయిన సంగం తహసీల్దార్ రమాదేవిని కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

• **ఉదయగిరి:** ఉదయగిరి తహసీల్దార్ నెహ్రూబాబు, వింజమూరు తహసీల్దార్ కేవీ కృష్ణారెడ్డిలు బదిలీపై తమ సొంత జిల్లాలకు వెళ్తున్న నేపథ్యంలో బుధవారం వారి కార్యాలయాల్లో రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఉదయగిరి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రీసర్వే డీటీ జహీర్‌ఖాన్, వింజమూరులో డీటీ చేవూరి శ్రీనివాసులు ఇన్‌చార్జ్ తహసీల్దార్లుగా బాధ్యతలు స్వీకరించారు.

• **అల్లూరు:** పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావును బుధవారం కార్యాలయ సిబ్బంది ఘన సన్మానం నిర్వహించారు. డీటీ నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

• **అనుమసముద్రంపేట:** బదిలీ అయిన తహసీల్దార్ రవికుమార్‌ను బుధవారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న నేతలు, కాలనీవాసులు

సోమశిల: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనంతసాగరం మండల కేంద్రంలోని గిరిజన కాలనీవాసులు సీఐటీయూ కార్యదర్శి అన్వర్ బాషా ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వర్‌బాషా మాట్లాడుతూ కాలనీలో సుమారు 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య ఉందన్నారు. సిమెంట్ రోడ్డు వేయాలని కోరారు. ఎస్టీ కాలనీ వంక పక్కన ఉండే వారికి విద్యుత్ సౌకర్యం లేక విషపురుగుల బారిన పడుతున్నారని వాపోయారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తాజ్ మస్రూర్‌కు వినతిపత్రం అందజేశారు.